www.prajasakti.com
ప్రజాశక్తి
సోమవారం 25 సెప్టెంబర్ 2023



అంగన్వాడీలపై నిర్బంధం

- ఎక్కడికక్కడ అడ్డుకుంటున్న పోలీసులు
- ముందస్తు అరెస్టులు, గృహనిర్బంధం

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: మైకు తీసుకుంటే అక్కచెల్లమ్మకు ఏదో చేస్తున్నట్లు గొప్పలు చెప్పుకొనే జగన్ ప్రభుత్వం మరోసారి అంగన్వాడీలపై అక్కసు వెళ్లగక్కింది. తమ హక్కుల కోసం ఛలో విజయవాడకు బయలుదేరిన అంగన్వాడీ నేతలను గృహనిర్బదం చేయడంతో పాటు ఎక్కడిక్కడ అరెస్టు చేసి ఛలో విజయవాడను భగ్నం చేసేందుకు విశ్వప్రయత్నం చేసింది. అంగన్వాడీల సమస్యలపై సమరశఖం పూరిస్తూ ఈనెల 25వ తేది సోమవారం ఛలో విజయవాడకు పిలుపునిచ్చారు. అంగన్వాడీల గాజుల చప్పుడుకు భయపడిన ప్రభుత్వం జిల్లాలో పెద్దఎత్తున ఛలో విజయవాడకు బయలు దేరిన పోలీసులు నిర్బంధించారు. రైళుఎక్కుతున్న వారిని వెంటాడిమరీ పట్టుకొని పోలీస్‌స్టేషన్లలో ఉంచారు. జిల్లా, ప్రాజెక్టు నాయకులను గృహనిర్బందంలో ఉంచారు. బస్సులో బయలుదేరిన వారికి అడ్డుకొని దింపేశారు. తమ న్యాయమైన సమస్యల పరిష్కారం కోసం ఛలో విజయవాడకు వెళ్ళుతున్నట్లు అంగన్వాడీ యూనియన్ల నేతలు వారించినా పట్టించుకొని పోలీసులు కర్కసత్వాన్ని ప్రదర్శించారు. ఛలో విజయవాడకు ఆరు బస్సులో బయదేరిన అంగన్వాడీలను ఆదివారం ఉదయం బైరెడ్డిపల్లి, గంగవరం, వీకోట, కుప్పం పోలీస్ స్టేషన్లలో నిర్బంధించారు. కనీసం తాగేందుకు నీరు, భోజనం ఇవ్వకపోవడంతో గంగవరం పోలీస్‌స్టేషన్ ఎదుట అంగన్వాడీలు భైటాయించి నిరసన వ్యక్తం చేశారు. మదనపల్లిలో ఛలో విజయవాడకు రైలెక్కిన 60 మంది అంగన్వాడీల్లో 20 మందిని రైల్వే ప్లాట్‌ఫారంపై వెంటాడి పట్టుకొని మదనపల్లి వన్‌టౌన్ పోలీస్ స్టేషన్‌లో ఉంచారు. మహిళల్ని సాయంత్రం ఆరు గంటల తరువాత పోలీస్ స్టేషన్‌లో ఉంచరాదని చట్టం చెబుతున్నా సీఐ వచ్చేంత వరకు పంపేది లేదని పోలీసులు చెప్పడంతో మదనపల్లి పోలీస్ స్టేషన్ ఎదుట అంగన్వాడీలు నిరసనకు దిగారు.

కుప్పం, పుంగనూరు, వీకోట, గంగవరం, చిత్తూరు, బంగారుపాళ్యం ఇలా జిల్లా వ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అంగన్వాడీలను ఛలో విజయవాడకు వెళ్లనివ్వకుండా నిర్బందాలు కొనసాగాయి. ముఖ్యంగా యూనియన్ నేతల కదలికపై నిఘా ఉంచిన పోలీసులు ఆదివారం ఉదయం నుండీ గృహనిర్బంలో ఉంచారు. కొన్ని చోట్ల పోలీస్ స్టేషన్లకు కూడా తీసుకుపోయారు.

అంగన్వాడీల దుర్మార్గం

- యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షుడు వాడ గంగరాజు

అంగన్వాడీలు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకెళ్లాడానికి 25వ తేదీ తలపెట్టిన ధర్నాను విఫలం చేయడానికి ప్రభుత్వ, చిత్తూరు జిల్లా పోలీసులు నిర్బంధాన్ని, అరెస్టులు చేయడం దుర్మార్గం. ప్రజాస్వామ్యయుతంగా జరిగే ధర్నాలో హింస జరుగుతుందనే తప్పుడు ప్రచారం పోలీసులు చేయడం గర్హనీయం. బస్సులో విజయవాడ వెళుత్తున్న అంగన్వాడీలను కుప్పం, గంగవరం, వీ.కోట, బైరెడ్డిపల్లి పోలీసు స్టేషన్లో పెట్టడం దారుణం. ఎక్కడికక్కడ ఇళ్ల వద్దనే అరెస్టులు చేసి నిర్బంధించడం, వాహనాలను అడ్డుకోవడం, ధర్నాకు అనుమతి నివ్వకపోవడం అప్రజాస్వామికం.



వికోటలో..

అంగన్వాడీలు కొరుతున్నదేమిటి..!

- సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం గ్రాడ్యూటీని అమలు చేయాలి
- మిని సెంటర్లను మెయిన్ సెంటర్లుగా మార్చి మినీ వర్కర్లకు ప్రమోషన్లు కల్పించాలి.
- ఎఫ్ఆర్ఎస్ యాప్‌ను రద్దు చేసి ఒకే యాప్‌లో విధులు నిర్వహించేలా యాప్‌ను రూపొందించాలి.
- ప్రభుత్వ ఉద్యోగులు పదవీ విరమణ కాలం 62 సంవత్సరాలకు పెంచాలి. చివరి వేతనంలో 50శాతం పెన్షన్ ఇవ్వాలి.
- వైఎస్ఆర్ మెనూ చార్జీలు పెంచి, గ్యాస్ ప్రభుత్వమే సరఫరా చేయాలి.
- పెండింగ్ సెంటర్ అద్దెలు, టిఏ బిల్లులు చెల్లించాలి.
- నాణ్యమైన సరుకులు ప్రతి నెలా ఐదో తేదిలోపు సెంటర్లకు చేర్చాలి.

హక్కుల కోసం ప్రశ్నంచడం తప్పా

- యూనియన్, జిల్లా కార్యదర్శి షకిల

అంగన్‌వాడీ కార్మికులు తమ సమస్యల కోసం గత కొంతకాలంగా వివిధ రూపాలలో ఆందోళన చేస్తున్నారు. కలెక్టరేట్‌ల వద్ద ధర్నాలు, ప్రదర్శనలు చేశారు. అయినప్పటికీ ప్రభుత్వం నుండి స్పందన రాలేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం సమస్యల పరిష్కారానికి పూనుకోకుండా నిర్బంధం ప్రయోగించడం దారుణం. తమ న్యాయసమ్మతమైన కోర్కెలను ప్రభుత్వం దష్టికి తీసుకురావడం, నిరసన తెలపడం రాజ్యాంగం ఇచ్చిన హక్కు. ఆ హక్కును అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని హరించడమే. రాష్ట్ర ప్రభుత్వం అరెస్టు చేసినవారిని తక్షణమే విడుదల చేయాలి. అంగన్వాడీల న్యాయమైన కోర్కెలు పరిష్కరించాలి, అందుకు యూనియన్ నాయకులతో చర్చలు జరపాలి.



బైరెడ్డిపల్లిలో...

వీకోట : తమ సమస్యల పరిష్కారానికి రామకుప్పం మండలం అంగన్వాడీలు పెద్దఎత్తున విజయవాడలో చేపట్టిన మహాధర్నా కార్యక్రమానికి బస్సులో బయలుదేరి వెళుతుండగా వీకోట సమీపంలో టోల్‌గేట్ వద్ద పోలీసులు వాహనాన్ని ఆపి వారిని అదుపులోకి తీసుకున్నారు. యూనియన్ నాయకులు మంగమ్మ, అమరావతితో పాటు బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

బైరెడ్డిపల్లి: ఛలో విజయవాడ కార్యక్రమానికి వెళ్తున్న కుప్పం, శాంతిపురం, గుడిపల్లి, రామకుప్ప, వీకోట మండలాలకు చెందిన అంగన్వాడీలు 52 మందిని అరెస్టు చేసి స్థానిక రంగయ్య శెట్టి కళ్యాణ మండపంలో నిర్బంధించారు. వారికి కనీసం తాగునీరు, భోజనం కూడా పెట్టకపోవడంతో అంగన్‌వాడీలు నిరసనకు దిగారు.

గంగవరం: అంగన్‌వాడీలు తమ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం దష్టికి తీసుకురావడానికి తలపెట్టిన చలో విజయవాడను విఫలం చేయడానికి పోలీసులు నిర్బంధాన్ని, అరెస్టులను చేశారు. సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గిరిధర్ గుప్తాతో పాటు కుప్పం ప్రాజెక్టు అంగన్వాడీ అధ్యక్షురాలు ప్రమీల, కెపి.లత, వసంత, శైలజ, అనిత, మంగమ్మలను అరెస్టుచేసి పోలీసు స్టేషన్‌లో నిర్బంధించారు. దీంతో స్టేషన్ ఎదుట వారు నిరసన తెలిపారు.

బంగారుపాళ్యం: మండలంలోని అంగన్వాడీ యూనియన్ మండల అధ్యక్షులు వరలక్ష్మిని ఆదివారం ఉదయం నుండి గహ నిర్బంధం చేశారు. ఒగన్వాడీల మహాధర్నాకు విజయవాడకు వెళ్ళకూడదని ఉదయం 5 గంటల నుండి సాయంత్రం ఐదు గంటల వరకు గహంలోని ఉండాలని సీఐ నాగరాజు రావు నోటీసులు మంజూరు చేశారు.

పుత్తూరు టౌన్: అంగన్వాడీల చలో విజయవాడకు వెళుతున్న సిఐటియు జిల్లా కార్యదర్శి ఆర్.వెంకటేష్, పుత్తూరు ప్రాజెక్టు అధ్యక్షురాలు యు.విజయ కుమారిలను పోలీసు అరెస్టుచేసి స్టేషన్‌లో నిర్బంధించారు.



గంగవరంలో..



పుత్తూరులో..

ఉపాధ్యాయులలో ఉద్యమ స్ఫూర్తి నింపుదాం

యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు



బంగారుపాళ్యంలో..

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) 1974లో ఆవిర్భవించి నేటికి 49 ఏళ్లపూర్తి చేసుకుని 50వ సంవత్సరంలోకి అడిగిడిన నేపథ్యంలో అక్టోబర్ 1న విజయవాడలో జరుగనున్న ప్రారంభ స్వర్ణోత్సవసభకు ఉపాధ్యాయులు, విశ్రాంత ఉపాధ్యాయులు పెద్దఎత్తున పాల్గొనాలని ఉపాధ్యాయులకు యుటిఎఫ్ రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వర్లు కోరారు. ఆదివారం యుటిఎఫ్ స్వర్ణోత్స జాత చిత్తూరు జిల్లాలోని పుంగనూరులో, పలమనేరులో, బంగారు పాలెం మీదుగా చిత్తూరు నగరంకు చేరుకుంది. అనంతరం జిల్లా కేంద్రమైన చిత్తూరు యుటిఎఫ్ కార్యాలయంలో యుటిఎఫ్ జెండాను ఎగురవేశారు. ఈ సందర్భంగా నక్కా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడానికి ఉపాధ్యాయులలో స్నేహపూరిత బోధనా సౌకర్యాలు కల్పించాలని, ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడానికి ఉపాధ్యాయులందరూ సమైక్యం కావాలని కోరారు. అలాగే పాత పెన్షన్ విధానం పునరుద్ధరించే వరకు విశ్రమించ రాదని, యూటీఎఫ్‌లో ఉత్సాహాన్ని నింపుతూ ఈ బైక్ జాతా, ర్యాలీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర కార్యదర్శి టీ.రఘుపతి రెడ్డి, ఎస్ఎస్.నాయుడు, జిల్లా అధ్యక్షులు సోమశేఖర్ నాయుడు, ప్రధాన కార్యదర్శి జివి.రమణ నాయకులు సుధాకర్‌రెడ్డి, పిఆర్.మునిరత్నం, రెహనాబేగం, ప్రసన్నకుమార్, కష్ణమూర్తి, జగన్మోహన్‌రెడ్డి, రెడ్డప్ప నాయుడు, సిపి ప్రకాష్, పెద్ద ఎత్తున ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బంగారుపాళ్యం: ఉపాధ్యాయులలో ఉద్యమ స్ఫూర్తి నింపుదామని రాష్ట్ర అధ్యక్షులు నక్కా వెంకటేశ్వరరావు అన్నారు. ఆదివారం మండల కేంద్రానికి యుటిఎఫ్ స్వర్ణోత్స బైక్ జాతా చేరుకుది. ఈ సందర్భంగా యుటిఎఫ్ మాజీ సభ్యులు సాంబశి యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. వెంకటేశ్వరరావు మాట్లాడుతూ ఇది ఉపాధ్యాయ బృందానికి స్వర్ణోత్సమని, ఉపాధ్యాయ సమస్యలపై అనునిత్యం రాష్ట్ర కమిటీ పోరాడుతున్నదని ఇదే స్ఫూర్తితో రాబోయే తరంలో వారు పోరాడి ఉద్యమస్ఫూర్తిని నింపాలని పిలుపునిచ్చారు. అనంతరం యుటిఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా గౌరవ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, మండల కమిటీ సభ్యులు సరిత, మొగులయ్య, మోహన్‌రెడ్డి, ధనంజయరాజు, రమేష్ నాగయ్య, రామ కష్ణంరాజు పాల్గొన్నారు.

పుంగనూరు: ఉపాధ్యాయ సమస్యల పరిష్కారంలో యుటిఎఫ్ అగ్రగామిగా నిలిచిందని ఆ సంఘ రాష్ట్ర నాయకులు నక్కా వెంకటేశ్వర్లు, రఘుపతి రెడ్డి అన్నారు. యుటిఎఫ్ 50 వసంతాల సర్వోత్సవాల జాతను పుంగనూరు నియోజకవర్గ కేంద్రంలోకి ప్రవేశించగా యుటిఎఫ్ నేతలు భీమిగానిపల్లి సర్కిల్లో జాతకు ఆదివారం ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ ఉపాధ్యాయ సమస్యలపై యూటీఎఫ్ సంఘం నిరంతరం రాజీలేని పోరాటం చేస్తుందని గుర్తు చేశారు. అనతరంభీమిగానిపల్లి సర్కిల్ నుంచి పుంగనూరు, చౌడేపల్లి, సోమల మండలాలకు చెందిన యుటిఎఫ్ నాయకుల ఆధ్వర్యంలో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఎంఆర్‌సి వద్ద విశ్రాంత ప్రధానోపాధ్యాయులు రామచంద్రయ్య చేత యుటిఎఫ్ జెండాను ఆవిష్కరించారు. అనంతరం గూడురుపల్లి బైపాస్ సర్కిల్ వరకు యుటిఎఫ్ నాయకులు ర్యాలీగా వెళ్లి జాతాకు వీడ్కోలు పలికారు. యుటిఎఫ్ నాయకులు సుజాత, శివకుమారి, గాయత్రి, చిట్టెమ్మ, మంజుల, హిమబిందు, శివకుమారి జీవి రమణ పాల్గొన్నారు.



పుంగనూరులో..

ప్రజాభిప్రాయం మేరకే నిర్మాణాలు చేపట్టాలి

సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు

ప్రజాశక్తి- కార్వేటినగరం: మండలం ముక్రవాణిపల్లెలో నూతనంగా నిర్మిస్తున్న డ్యాం నిర్మాణానికి ప్రజాభిప్రాయం లేకుండా చేపట్టకూడదని సిపిఎం జిల్లా కార్యదర్శి వాడ గంగరాజు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముక్కరవానపల్లిలో నూతనంగా ఏర్పాటు చేస్తున్న డ్యాం వలన ప్రజలు ఇబ్బందులకు గురవుతారని గ్రామ ప్రజలందరూ ముక్తకంఠంతో వ్యతిరేకిస్తుంటే అధికార యంత్రాంగం, అధికార పార్టీ ఎందుకు అంత తహతకులాడుతున్నదో అర్థం కాని పరిస్థితి ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న డ్యాంలను ఆధునికరిస్తే సరిపోతుందని ప్రజలు కోరుతున్నారని, అలాంటి చోట నూతనంగా డ్యాం నిర్మాణం వలన 542 ఎకరాలు ముప్పుకు గురవడమే కాకుండా 300 మంది ప్రజలకు సంబంధించిన గ్రామాలు పూర్తిగా తొలగించాల్సిన పరిస్థితి ఉందన్నారు. అయితే అధికారులు చెప్పే పద్ధతి చూస్తే ప్రజలకి ప్రత్నామయ మార్గాలు చూస్తామని చెప్తున్నప్పటికీ ప్రజలు విశ్వసించడం లేదన్నారు. ఏళ్లతరబడి ఇక్కడే జీవిస్తున్న వారు గ్రామాలు వదులుకునే పరిస్థితి లేదని ప్రజలు ముక్తకంఠంతో చెబుతున్నారని, కానీ ప్రజలను ఇబ్బంది కలిగించే పరిస్థితితో డ్యాం నిర్మించాల్సిన పరిస్థితి ఏంటి అని అన్నారు. అధికారులు ప్రత్నామయ మార్గాలు శాస్త్రీయ పద్ధతులు చెప్పకుండా ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని, గ్రామసభల్లో ప్రజాభిప్రాయం ఎలా ఉంటే అదే పద్ధతిలోనే రిపోర్టులు పంపించాలని వారి అభిప్రాయం ప్రకారమే ఏదైనా చేయాలని ఆయన కోరారు. అలా కాకుండా తూతూమంత్రంగా ప్రజాభిప్రాయం చేపట్టి ప్రజల అభిప్రాయానికి వ్యతిరేకంగా నిర్ణయాలు చేస్తే ప్రజలను కూడగట్టే పోరాటం చేస్తామని, సిపిఎం వారికి అండగా నిలబడుతుందని తెలిపారు. ఇలాంటి నిర్మాణాలు చేపట్టినచోట 2013 భూసేకరణ చట్ట ప్రకారం ఎలాంటి నష్టపరిహారం చెల్లించడం లేదని ఆయన తెలిపారు.

టౌన్ బ్యాంకు పై నమ్మకం ఉంచుద్దాం

ఎంఎల్‌ఏ ఆరణి శ్రీనివాసులు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: చిత్తూరు టౌన్ బ్యాంకుపై నమ్మకం ఉంచి పాలకవర్గానికి సహకరించాలని ఆదివారం స్థానిక గిరిమ్స్‌పేటలో నిర్వహించిన చిత్తూరు టౌన్ బ్యాంకు మహాజన సభలో ముఖ్య అతిధిగా పాల్గొన్న చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు కోరారు. చిత్తూరు టౌన్ బ్యాంకు మహాజన సభ ఛైర్మెన్ రామ్‌గణేష్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఎల్ఏ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యం, స్వలాభం వల్ల బ్యాంకు ఇబ్బందులకు గురికావడం జరిగిందని కోట్లాది రూపాయలు ఇతర బ్యాంకుల్లో డిపాజిట్లు చేయడం వల్ల టౌన్ బ్యాంకు ఇబ్బందులు ఎదుర్కొని ఖాతాలదారులను ఇబ్బందులకు గురిచేసిందన్నారు. ప్రస్తుతం పాలకవర్గం ఎప్పటికప్పుడు ఖాతాదారుల సూచనలు, సలహాల మేరకు బ్యాంకు తిరిగీ పూర్వవైభం సంతరించుకొనేలా కృషి చేస్తున్నట్లు చెప్పారు. చిత్తూరు టౌన్ బ్యాంకును మన బ్యాంకుగా భావించి ఖాతాదారులు సహకరించాలన్నారు. ఎలాంటి లోటుపాట్లు ఉన్నా పాలకవర్గం, తన దృష్టికి తీసుకురావాలన్నారు. ఈ సమావేశంలో టౌన్‌బ్యాంకు సీఈఓ, బ్యాంకు పాలకవర్గం, ఖాతాదారులు పాల్గొన్నారు.



టౌన్ బ్యాంకు మహజన సభ సమావేశంలో మాట్లాడుతున్న ఎంఎల్ఏ ఆరణి

కనికరించండయ్యా...

- కౌండిన్యా నీటి ప్రవాహానికి బావులుగా మారిన సాగు భూములు
- సమస్య పరిష్కరించాలని వేడుకుంటున్న రైతన్నలు

ప్రజాశక్తి- పలమనేరు: పలమనేరు రూరల్ మండలంలోని మొసలిమడుగు గ్రామసమీపంలోని కౌండిన్యా నదిలో గతంలో చెక్‌డ్యాం నిర్మించారు. డ్యాం కింద భాగంలో నీరు లీకేజీ కారణంగా గత ప్రభుత్వం మరికొన్ని చెక్‌డ్యాంల ఎత్తు పెంచేందుకు ప్రతిపాదనలు పంపారు. ఆ సమయంలో ఈ చెక్‌డ్యాం కూడా రెండు అడుగులు ఎత్తు పెంచినట్లు అప్పటి ఇరిగేషన్ అధికారులకు తెలిపారు. ఈ క్రమంలో చెక్‌డ్యాం రెండు అడుగులు ఎత్తు పెంచి పక్కనున్న వ్యవసాయ భూముకు నీరు వెళ్ళకుండా చెక్‌డ్యాంకు ఇరువైపులా సిమెంటుతో నిర్మాణం చేపట్టకుండా అలాగే వదిలేశారు. ఇంతలో కొద్ది నెలల్లోనే ప్రభుత్వం మారడం వరుసక్రమంగా మూడేళ్ళ పాటు అధిక వర్షాల కారణంగా కౌండిన్యానదిలో నీటిమట్టం భారీగా పెరిగి నదిలో ప్రవహించాల్సిన నీరంతా పక్కనున్న రైతుల సాగు భూములపైనే ఏళ్ళ తరబడి నీరు ప్రవహించడం వలన భారీ నీటి ప్రవాహానికి కోత దశలో ఉన్న వరి పంటలతోపాటు సారవంతమైన భూములు కూడా కోతకు గురై బావులుగా, పెద్దపెద్ద గంతలు పడి బండరాళ్ళు తేలిపోయి వ్యవసాయానికి పనికిరాకుండా పోతున్నాయని రైతన్నలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏళ్ళతరబడి సాగుభూముల్లో వ్యవసాయం చేయలేకపోవడం వలన బీడు భూములుగా తయారైందని వాపోతున్నారు. ఈ విషయమై సంబంధిత అధికారులకు, ప్రజా ప్రతినిధులకు అనేకసార్లు అర్జీల రూపంలో విన్నవించినా ఇంతవరకూ ఎవరూ ఏమాత్రం పట్టించుకోలేదు. మళ్ళీ వర్షాకాలం వస్తోంది.. ఆ తరువాత ఎలక్షన్స్ దగ్గరపడుతుంది. ఆ లోపలే ప్రభుత్వం స్పందించి వ్యవసాయ భూముల్లోకి నది నీరు రాకుండా సిమెంటుతో నిర్మాణం చేపట్టాలని రైతులు కోరుతున్నారు. అప్పటి వరకు వ్యవసాయ భూములు పంటలు వేసేందుకు వీలుకాక బీడు భూములుగానే వదిలేయాలని భాదిత రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



సాగుభూమిలో చేరిన నది నీరు


వరద నీటితో పరుగులు తీస్తున్న వాగులు

- కొట్టుకుపోయిన రోడ్లు, వంతెనలు - స్తంభించిన రాకపోకలు



కందూరు వద్ద కొట్టుకుపోయిన తాత్కాలిక మట్టి రోడ్డు

ప్రజాశక్తి- సోమల: సోమల మండలంలో శనివారం రాత్రి కురిసిన భారీవర్షం కారణంగా మండలంలోని పలు వంకలు, వాగులు నీటితో నిండి పరవళ్ళు తొక్కుతూ పరుగులు తీస్తున్నాయి. పెద్ద ఉప్పరపల్లి నుండి పేటూరికి వెళ్లే మార్గమధ్యంలో ఆరోగ్య కేంద్రం సమీపంలో గార్గేయ నది ఉధతంగా ప్రవహిస్తుండడంతో ఉదయం కొద్దిసేపు రాకపోకలు ఆగిపోయాయి. నాలుగు అడుగుల మేర నీటి ప్రవాహం రోడ్డుపై ప్రవహిస్తుండడంతో రాకపోకలు ఆగిపోయి. తదనంతరం పది గంటల నుండి వాహనాల రాకపోకలు కొనసాగాయి. వర్షం కారణంగా ఈ ప్రాంతంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. భారీ వర్షం కారణంగా టమోటా పంటలకు తీవ్ర-నష్టం వాటిలినట్టు సమాచారం. మేజర్ పంచాయతీ కేంద్రమైన కందూరు కలికిరి మార్గమధ్యంలోని ఉన్నత పాఠశాల సమీపంలో కందూరు ఏరు ఉధతంగా ప్రవహిస్తుండడంతో తాత్కాలికంగా వేసిన మట్టిరోడ్డు నీటి ఉధతికి కొట్టుకుపోయింది. దీంతో కలికిరి సోమల మార్గంలో వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది. ఆవులపల్లి పంచాయతీ పత్రపల్లికి వెళ్ళు మార్గంలో గార్గేయ నది వంతెన పై పొంగి పొరలి నీటి ప్రవాహం వెళ్లడంతో స్థానికులు రాకపోకలకు ఇబ్బంది పడ్డారు.



నీటమునిగిన టమాటా పంట

చంద్రబాబుపై తప్పడు కేసులు

రిలే దీక్షలో బలిజ సంఘం నేతలు

ప్రజాశక్తి- చిత్తూరుఅర్బన్: జాతీయ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడుని అక్రమంగా తప్పుడు కేసులు బనాయించి అరెస్టు చేసి జైల్లో పెట్టినందుకు నిరసనగా చిత్తూరు అసెంబ్లీ నియోజకవర్గం పరిధిలోని బలిజ కులస్తుల ఆధ్వర్యంలో ఆదివారం రిలే నిరాహార దీక్ష నిర్వహించారు. ఈకార్యక్రమంలో నగర పార్టీ అధ్యక్షురాలు కటారి హేమలత, చిత్తూరు పార్లమెంట్ పార్టీ ఉపాధ్యక్షులు కాజురు బాలాజీ, టిడిపి నాయకులు సతీష్, రాజేష్, మోహన్ రాజ్, కష్ణమూర్తి, కిషోర్ పాల్గొన్నారు. దీక్షకు సంఘీభావంగా మాజీ ఎమ్మెల్సీ దొరబాబు, చిత్తూరు పార్లమెంట్ తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి కోదండ యాదవ్ జనసేన నాయకులు కవిత, సర్వణ పాల్గొన్నారు.



చంద్రబాబు అరెస్టును నిరశిస్తూ రిలే దీక్షల్లో బలిజ సంఘం నేతలు

గజ వాహనం పై గణనాధుని చిద్విలాసం


ప్రజాశక్తి- ఐరాల: కాణిపాకం స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా ఆదివారం గజ వాహనసేవ కన్నుల పండువగా జరిగింది. శ్రీ వరసిద్ది వినాయక స్వామి వారికి అత్యంత ప్రీతి పాత్రుడైన గజ వాహనంపై సిద్ధిబుద్ధి సమేత స్వయంభూ శ్రీవరసిద్ధి వినాయక స్వామి వారు ఊరేగుతూ భక్తులను అలరించారు. ఈమేరకు ఆలయ వరుస ఉత్సవ ఉభయదార్లు అయిన కాణిపాకం గ్రామానికి చెందిన వాన్నియర్ నాయకర్ వంశస్థులు ఉభయదార్లుగా వ్యవహరించి ఉదయం స్వామి వారి ములవిరాట్‌కు పరిమిళ సుగంధ ద్రవ్యాలతో అభిషేకించారు. అనంతరం చామంతి, మల్లె, జాజి తదితర విదేశ పరిమిళ పుష్పాలతో అలంకరించి భక్తులకు స్వామి వారి దర్శనం భాగ్యం కల్పించారు. భక్తులకు స్వామివారి తీర్థప్రసాదాలు, పంచామతం పంచిపెట్టారు. గజ వాహనంపై గణనాధుని ఉంచి కాణిపాకం పురవీధులు గుండా మంగళ వాయిద్యాలు నడుమ బాణా సంచాలు పేలుస్తూ అత్యంత వైభవంగా ఊరేగించారు. ఆలయ ట్రస్టు బోర్డు ఛైర్మెన్ ఎ.మోహన్ రెడ్డి, ఆలయ ఈవో ఎ.వెంకటేశులు, ఈఈ వెంకట నారాయణ, ఆలయ ఎఎఈవోలు ఎస్వీ కష్ణారెడ్డి, విద్యాసాగర్ రెడ్డి, హరిమాధవరెడ్డి, హేమమాలిని, ఆలయ సూపరింటెండెంట్లు కోదండపాణి, శ్రీధర్ బాబు, టెంపుల్ ఇన్ స్పెక్టర్లు పి.బాబు, పి.సురేష్ బాబులతో పాటు ఆలయ సిబ్బంది వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలలో పేలుడు

హెచ్ఎం ఫిర్యాదు మేరకు కేసు నమోదు దర్యాప్తు

ప్రజాశక్తి-సోమల: మండలంలోని ఆవులపల్లె పంచాయతీ కలమందల వారిపల్లె ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో శనివారం సాయంత్రం పేలుడు సంభవించింది. పేలుడు శబ్ధం దాటికి సమీపంలోని గ్రామస్తులు హుటాహుటిన సంఘటన స్థలానికి వెళ్లి పాఠశాల సిబ్బందికి సమాచారం ఇవ్వడంతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. సంఘటనపై ఎస్సై వెంకట నరసింహులు మాట్లాడుతూ వంగసాని వారిపల్లెకు చెందిన వినోద్, చంటి అనే ఇరువురు తమ పొలాల్లో ఎలుకల బెడద అధికంగా ఉండడంతో పులిచెర్ల మండలానికి చెందిన గంగరాజు, రాజశేఖర్ అనే వ్యక్తులను ఎలుకలను పట్టడానికి పిలిపించారు. వారు కలమందల వారిపల్లె ప్రాథమిక పాఠశాల ఆవరణంలో తలదాచుకొని శనివారం సాయంత్రం 7.30గంటల ప్రాంతంలో ఎలుక పిల్లులు, అడవి పందులు చంపడానికి ఉపయోగించే టపాసుల పౌడర్‌ను సిద్ధం చేసుకుని దానిని పాఠశాల ఆవరణంలోని కిటికీ ఊచకు తగిలించే ప్రయత్నం చేస్తుండగా కింద పడటంతో పేలిపోయింది. దీంతో రాజశేఖర్, గంగరాజు ఇరువురికి తీవ్ర గాయాలయ్యాయి. భారీ శబ్దం రావడంతో సమీపంలోని గ్రామస్తులు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని విషయాన్ని పాఠశాల సిబ్బందికి తెలియజేయగా వారి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఆయన తెలిపారు.



సంఘటన స్థలంలో రక్తపు మరకలు

జనావాసాల మధ్య కొండ చిలువ



పామును చాకచక్యంగా పట్టుకున్న అటవీ శాఖ సిబ్బంది

ప్రజాశక్తి-గుడిపల్లి: గుడిపల్లి మండలంలోని చిన్న హస్తల్ ప్రాంతంలోని జనావాసాలకు మధ్యలో కొండ చిలువ కనిపించడంతో ఆదివారం ఆ కుటుంబ సభ్యులు భయభ్రాంతులకు గురి అయ్యారు. ఈ సమాచారం గుడిపల్లి మండల పంచాయతీ పార్టీ ప్రెసిడెంట్ టిడిపి నాయకుడు మంజునాథ్ కి సమాచారం అందించారు. ఈ సమాచారం తెలుసుకున్న వెంటనే అటవీ శాఖ సిబ్బంది రోజా కు సమాచారం అందించిన వెంటనే అటవీ శాఖకు సంబంధించిన శివకు వెంటనే సమాచారం అందించి శివ చాకచక్యంగా స్థానికుల సహాయంతో ఆ పామును వెంటనే పట్టుకొని మల్లప్ప కొండ అడవి పరిసరాల్లో జాగ్రత్తగా విడిచిపెట్టారు. దీంతో స్థానికులు అటవీ శాఖ సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



చీని, డ్రాగన్ ఫ్రూట్స్ పంటలను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

చీని , డ్రాగన్ ఫ్రూట్స్ పంటల పరిశీలన

ప్రజాశక్తి - గంగాధర నెల్లూరు: గంగాధరనెల్లూరు మండలంలోని పాపిరెడ్డి పల్లి పంచాయతీ లోని చీని , డ్రాగన్ ఫ్రూట్స్ పంటలను శాస్త్రవేత్తలు పరిశీలించారు. ఏరువాక కేంద్రం ప్రధాన శాస్త్రవేత్త రెడ్డి రామ్ , విస్తరణ శాస్త్రవేత్త రాఘవేందర్ రెడ్డిలు కలిసి పాపిరెడ్డి పల్లె లో చీని, డ్రాగన్ పంట రైతులతో మాట్లాడారు. అనంతరం చీని, డ్రాగన్ ఫ్రూట్స్ పంటలకు ఎల్లో మోజాయిక్ వైరస్ నివారణకు రోగోర్ 1 లీటర్, వేప నూనె ఒక లీటరును 500 లీటర్ల నీటిలో కలుపుకొని పిచికారి చేయాలని సలహాలు, సూచనలు శాస్త్రవేత్తలు రైతులకు తెలిపారు. ఆవిధముగా పిచికారి చేయడం ద్వారా పండ్ల తోటలను దోమలు బెడద నుండి కాపాడుకోవచ్చునని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వందన, గ్రామ వ్యవసాయ సహాయకులు చక్రవర్తి , శిరీష పాల్గొన్నారు.

ఘనంగా గణనాథుని నిమజ్జనం

ప్రజాశక్తి-గుడిపల్లి:మండలంలోని కాడేపల్లిలో ఆదివారం వినాయక చవితి సందర్భంగా ఏర్పాటు చేసిన గణనాథుని నిమజ్జనం వేడుకలు ఘనంగా నిర్వహిం చారు. ఈ కార్యక్రమంలో కాడేపల్లి యువత పాల్గొని గణనాథునికి పూజా కార్యక్రమాలను నిర్వహించి నిమజ్జనం చేశారు. గణనాథుని నిమజ్జనం లో భాగంగా స్వామివారి లడ్డు ప్రసాదం వేలం పాట నిర్వహించగా కాడేపల్లికి చెందిన భాస్కర్ ఐదువేల రూపాయలకు లడ్డూ ప్రసాదాన్ని సొంతం చేసుకొని భక్తులకు పంచి పెట్టారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు దేవేంద్ర, రాము కాడేపల్లి యువత పా ల్గొన్నారు.




5కె వాక్‌థాన్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

గుండె వ్యాధుల పట్ల నిర్లక్ష్యం చేయొద్దు

అమర హాస్పిటల్ ఎండి డాక్టర్ రమాదేవి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: గుండె వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని నిర్లక్ష్యం చేయవద్దని అమర హాస్పిటల్ ఎండి డాక్టర్ రమాదేవి తెలిపారు. ఈనెల 29న ప్రపంచ హృద్రోగ దినోత్సవం సందర్భంగా తిరుపతిలోని అమర హాస్పిటల్ ఆదివారం 5కె వాక్‌థాన్‌ను అలిపిరి నుంచి ప్రారంభించి జూ పార్క్ వరకు ఐదు కిలోమీటర్లు ఉత్సాహవంతంగా కొనసాగించారు. ఈ కార్యక్రమంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ శివకష్ణ, డాక్టర్ నౌషాద్, డాక్టర్ శంకర్, డాక్టర్ అశోక్‌రెడ్డి, డాక్టర్ రవికుమార్, డాక్టర్ విజయేంద్ర రెడ్డి, ఐఐటి డైరెక్టర్ ఏఎస్‌పి జక్కా కులశేఖర్, యువత పాల్గొన్నారు. గుండె ఆరోగ్యంగా ఉండాలంటే రోజు కనీసం 30 నిముషాలు వ్యాయామం చేయాలని ఏఎస్‌పి జక్కా కులశేఖర్ తెలిపారు. ఎండి డాక్టర్ రమాదేవి మాట్లాడుతూ గుండె సంరక్షణపై ఆరోగ్యకరమైన జీవనశైలి పై అవగాహన కల్పించడానికి ఈకార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. వరల్డ్ హార్ట్‌డే సందర్భంగా హెల్త్‌హార్ట్ ప్యాకేజ్ రూ.699లకే అందిస్తున్నట్లు తెలిపారు. దీనిలో ఈసీజీ, 2డి ఇకో, హిమోగ్లోబిన్, ఎఫ్‌బిఎస్, పిపిబిఎస్, క్రియాటినైన్, కొలెస్ట్రాల్, కార్డియాలజిస్ట్ కన్సల్టేషన్ ఉంటుందని అమర హాస్పిటల్ సిఎఓ వేణుగోపాల్ మార్కెటింగ్ మేనేజర్ నరసింహారావు తెలిపారు.



అక్కినేని నాగేశ్వరావు జయంతి వేడుకల్లో మాట్లాడుతున్న చిత్తూరు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు

ఘనంగా అక్కినేని జయంతి

ప్రజాశక్తి- చిత్తూరు అర్బన్: ప్రముఖ సినీ నటుడు అక్కినేని నాగేశ్వరావు జయంతి వేడుకలు ఆదివారం స్థానిక టిటిడి కళ్యాణ మండపంలో అక్కినేని, నాగార్జున అభిమాన సంఘాల నేతృత్వంలో ఘనంగా నిర్వహించారు. ఈ జయంతి వేడుకలకు ఎంఎల్ఏ ఆరణి శ్రీనివాసులు, నగర మేయర్ అముద ముఖ్య అతిధులుగా పాల్గొన్నారు. అక్కినేని, ఎన్‌టిఆర్ తెలుగు చిత్ర సీమకు రెండు కళ్ళువంటి వారని అక్కినేని అనేక సాంఘీక సామాజిక చిత్రాలు తెలుగు వారికి అందించారన్నారు. అక్కినేని జయంతిని చిత్తూరులో జరపడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ సందర్భంగా పలువురికి అవార్డులు ప్రదానం చేశారు. అక్కినేని అభిమాన సంఘాల విజ్ఞప్తి మేరకు చిత్తూరులో అక్కినేని నాగేశ్వరావు విగ్రహాన్ని ఏర్పాటు చేసేందుకు స్థలాన్ని కేటాయించనున్నట్లు నగర మేయర్ అముద తెలిపారు. ఈ కార్యక్రమంలో అక్కినేని నాగేశ్వర్‌రావు వీరభిమాని ఖురీష్‌భాషా, నాగార్జున అభిమాన సంఘం జిల్లా అధ్యక్షులు ఎత్తిరాజులు, రిటైర్డ్ పోలీస్ ఉద్యోగుల సంఘం నాయకులు మురళితో పాటు పలువురు అక్కినేని నాగేశ్వరావు, నాగార్జున అభిమానులు పాల్గొన్నారు.

భవ్యశ్రీ మృతికి కారకులైన వారిని అరెస్ట్ చేయాలి

పోలీస్ స్టేషన్ ఎదుట వడ్డెర సంఘం నాయకుల నిరసన


ప్రజాశక్తి - యాదమరి: మండలంలోని రాజా వేణుగోపాలపురం గ్రామంలో సంచలనం రేపిన భవ్యశ్రీ మృతికి కారకులైన నిందితులను తక్షణం అరెస్టు చేసి, కుటుంబానికి న్యాయం చేయాలని జిల్లా వడ్డెర సంక్షేమ సంఘం అధ్యక్షుడు రవీంద్ర రాజు, సీనియర్ నాయకుడు మురగయ్య, వడ్డెర సంక్షేమ సంఘం సాధికార సమితి తిరుపతి జిల్లా అధ్యక్షుడు శ్రీరామ్, వడ్డెర జే ఏ సి చైర్మన్ వేముల సుబ్బారావులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం సంఘం నేతలతో కలిసి పెనుమూరు పోలీస్ స్టేషన్ ఎదుట భవ్యశ్రీ మృతిపై న్యాయం చేయాలని నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ భవ్యశ్రీ మృతిపై అనుమానాలు ఉన్నాయని, మృతికి కారకులైన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. అధికార పార్టీ నేతల అండదండలతో పోలీసులు కేసును నీరుగార్చేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. కేసు విచారణకు ప్రత్యేక అధికారిని నియమించాలని డిమాండ్ చేశారు. చిత్తూరు డీఎస్పీ శ్రీనివాస మూర్తి, దిశ డీఎస్పీ బాబు ప్రసాద్ లు పోలీస్ స్టేషన్ చేరుకుని నిరసన కారులతో మాట్లాడుతూ భవ్యశ్రీ మృతి కేసులో బాధితులకు న్యాయం చేస్తామని సర్ది చెప్పారు. అనంతరం ఘటనా స్థలాన్ని డీఎస్పీలు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వడ్డెర సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తురక అమర్నాథ్, కోశాధికారి సుబ్రమణ్యం, యువత అధ్యక్షుడు హరిబాబు, ప్రధాన కార్యదర్శి రుద్రయ్య, నేతలు తిరుమల, మకరందం, సుధాకర్, అశోక్, మణి, వాసు, శేఖర్ పాల్గొన్నారు.



పోలీస్ స్టేషన్ ఎదురు నిరసన తెలుపుతున్న వడ్డెర సంక్షేమ సంఘం నాయకులు

శోభాయమానంగా స్నపన తిరుమంజనం

ప్రజాశక్తి- తిరుమల: రంగురంగుల గాజులు, ఆప్రికాట్ ఫలాలు, వట్టివేరు, కురువేరు, రోజామాలలతో శ్రీదేవి భూదేవి సమేత మలయప్ప స్వామికి స్నపన తిరుమంజనం వేడుకగా నిర్వహించారు. శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో ఆదివారం మధ్యాహ్నం ఒంటి గంట నుండి మూడు గంటల వరకు అర్చకులు వేద మంత్రోచ్చారణ మధ్య స్నపన తిరుమంజనం శాస్త్రోక్తంగా నిర్వహించారు. శ్రీదేవి, భూదేవి సమేతంగా శ్రీమలయప్ప స్వామి ఉత్సవమూర్తులను ప్రత్యేక వేదికపై ఆశీనులను చేసి వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో విశేషంగా అభిషేకం చేశారు. ముందుగా విష్వక్సేనారాధన, పుణ్యాహవచనం, ముఖ ప్రక్షాళన, ధూపదీప నైవేద్యం, ఛత్ర ఛామర వ్యజన దర్పణాది నైవేద్యం, రాజోపచారం నిర్వహించారు. అర్ఘ్యపాద నివేదనలో భాగంగా పాలు, తేనె, కొబ్బరినీళ్లు, పసుపు, గంధంతో స్నపనం నిర్వహించారు. వీటిని శంఖనిధి, పద్మనిధి, సహస్రధార, కుంభధారణలతో వైఖానస ఆగమోక్తంగా స్నపనం చేపట్టారు. ఈ సందర్భంగా ఉపనిషత్తు మంత్రాలు, దశశాంతి మంత్రాలు,





పురుషసూక్తం, శ్రీసూక్తం, భూసూక్తం, నీలాసూక్తం, విష్ణుసూక్తం వంటి పంచసూక్త మంత్రాలు, దివ్యప్రబంధంలోని అభిషేక సమయంలో అనుసంధానము చేసే వేదాలను టీటీడీ వేదపారాయణ దారులు పారాయణం చేశారు. అభిషేకానంతరం వివిధ పాశురాలను తిరుమల పెద్ద జీయ్యర్, తిరుమల చిన్న జీయ్యర్ పఠించారు. ఈవేడుకలో రంగురాళ్లతో కూడిన గాజుల మాలలు, ఆప్రికాట్ మాలలు, వట్టివేరు మాలలు, కురువేరుమాలలు, రంగురంగుల రోజామాలలు, పసుపు రోజామాలలు, మిక్స్ డ్రైఫ్రూట్స్ మాలలు, తెలుపు ముత్యాల మాలలు, కిరీటాలు, తులసి మాలలను స్వామి, అమ్మవార్లకు అలంకరించారు. టీటీడీ గార్డెన్ విభాగం డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో ప్రత్యేక అలంకరణలు చేశారు. తమిళనాడులోని తిరుపూర్‌కు చెందిన రాజేందర్ ఈమాలలను విరాళంగా అందించారు. అదేవిధంగా, హైదరాబాదుకు శ్రీహరి, శ్రీధర్, శ్రీనివాస్ విరాళంతో రంగనాయకుల మండపంలో సంప్రదాయ పుష్పాలు, కట్ ఫ్లవర్లతో విశేషంగా అలంకరించారు. టీటీడీ ఈవో ఎవి ధర్మారెడ్డి, ఆలయ డెప్యూటీ ఈవో లోకనాథం, ఇతర అధికారులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు

ఘనంగా ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవ వేడుకలు

ప్రజాశక్తి -సోమల: మండల కేంద్రమైన ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థిని విద్యార్థులు అధ్యాపక బృందం ఆధ్వర్యంలో ఎన్‌ఎస్‌ఎస్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు ఎన్‌ఎస్‌ఎస్ విద్యార్థులు పాఠశాల ఆవరణంలోని పిచ్చి మొక్కలను చెత్తాచెదారని తొలగించి తమ సేవా భావాన్ని చూపించారు. అనంతరం కళాశాల ప్రిన్సిపాల్ గంగాధర నాయుడు మాట్లాడుతూ మహాత్మా గాంధీ శత జయంతి ఉత్సవాలలో భాగంగా 1969 సెప్టెంబర్ 24వ తేదీ ప్రారంభించిన ఎన్‌ఎస్‌ఎస్ కార్యక్రమం దేశవ్యాప్తంగా అమలు అవుతోందని విద్యార్థులు సేవా భావాన్ని పెంపొందించుకొని వారి వారి గ్రామాలలో పరిసరాల పరిశుభ్రత ఇతరులకు సేవ చేయడం సహాయ సహకారాలు అందించడం నేర్చుకోవాలని విద్యార్థుల ను కోరారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ కోఆర్డినేటర్ పలువురు విద్యార్థులు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

కొనసాగుతున్న టిడిపి నిరసనలు

నగరి: టిడిపి జాతీయ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్ట్ ను ఖండిస్తూ , బాబుతో మేము సైతం అంటూ నింద్ర మండల టీడీపీ నాయకులు ఆధ్వర్యంలో చేపట్టిన నగరి ఆర్డిఓ ఆఫీస్ ఎదురుగా ఉన్న రిలే నిరాహార దీక్ష లో నగరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ గాలి భాను ప్రకాష్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నింద్ర మండల పార్టీ ప్రెసిడెంట్ వెంకటేశ్వరరావు, వైస్ ప్రెసిడెంట్ ఆనందరాజు, ప్రధాన కార్యదర్శి విజయ్ కుమార్ , రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రెసిడెంట్ దశరధ వాసు, నియోజకవర్గ తెలుగు మహిళ అధ్యక్షు రాలు సంపూర్ణ మ్మ, బాబు యాదవ్, మహేష్, మనోజ్, రమేష్ నాయుడు, గంగాధరం, వేణు, ఎ.జె.రవి కుమార్, రవి నాయుడు, బుజ్జి, శివ, ప్రకాష్, ప్రసాద్, సీనియర్ నాయకులు కె.బాలాజీ, క్రిష్ణారెడ్డి, మీరా, పట్టణ ప్రెసిడెంట్ రమేష్ బాబు పాల్గొన్నారు.

పుంగనూరు:మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అక్రమ అరెస్టును నిరసిస్తూ కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించి వారికి మద్దతుగా నిలుస్తున్నట్టు గ్రామస్తులు పేర్కొన్నారు. పుంగనూరు మండలం వనములదిన్నె గ్రామంలో పెద్ద ఎత్తున ప్రజలు ముందుకు వచ్చి అక్రమ అరెస్టుపై నిరసన తెలిపి శనివారం రాత్రి క్యాండిల్ వెలిగించి,కాగడాలు ప్రదర్శించి, మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో పెద్ద ఎత్తున మహిళలు టిడిపి అభిమానులు, నాయకులు పాల్గొన్నారు.

గంగాధర నెల్లూరు:చంద్రబాబు నాయుడు జైలు నుంచి విడుదల అయ్యేంత వరకు దీక్షా శిబిరాన్ని నిర్వహిస్తామని టిడిపి నాయకులు అన్నారు. 12 వ రోజు ఆదివారంసైతం దీక్షా శిబిరం కొనసాగింది. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభావశీలుల కమిటీ మెంబర్ భీముని చిట్టిబాబు నాయుడు, జిల్లా ఉపాధ్యక్షులు కృష్ణమ నాయుడు, జిల్లా యాదవ సాధికార సమితి అధ్యక్షులు శ్రీధర్ యాదవ్ ,పెనుమూరు మాజీ ఎంపీపీ హరిబాబు నాయుడు ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో గంగాధర నెల్లూరు మండల పార్టీ అధ్యక్షులు స్వామి దాసు ,టిడిపి నేతలు కోదండ రెడ్డి, కిషన్ చంద్, రావిళ లోకేష్ ,లోకనాథ్ రెడ్డి, రుద్రయ్య నాయుడు, ప్రభాకర్ నాయుడు ,సుధాకర్ నాయుడు, ప్రకాష్ చౌదరి ,జ్యోతి రెడ్డి ,దేవరాజులు, పలువురు టిడిపి నేతలు సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు పాల్గొన్నారు.

గుడిపల్లి: గుడిపల్లి మండలం యామగానపల్లి గ్రామా నికి చెందిన టిడిపి సీనియర్ నాయ కుడు.. కొండ్లప్ప తమ నాయకుడు చంద్రబాబు అక్రమ అరెస్ట్ తట్టుకోలేకుండా.. గుండె పోటుతో మృతి చెంది నట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. పదేపదే చంద్రబాబు అక్రమ అరెస్టు తలు చుకుంటూ ప్రతిరోజూ తిండి, నిద్ర లేకుండా ఉండే వాడని అలాంటి వ్యక్తి చంద్రబాబు కు రెండు రోజులు సిఐడి కస్టడికి ఇవ్వడంతో తీవ్ర మనస్థాపానికి గురై మృతి చెందారని గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపారు.



కొండ్లప్ప (ఫైల్‌ఫొటో)

స్త్రీ విద్య తోనే సమాజాభివృద్ధి



సదస్సులో మాట్లాడుతున్న ఐద్వా తిరుపతి జిల్లా కార్యదర్శి సాయిలక్ష్మి

ప్రజాశక్తి -తిరుపతి టౌన్:స్త్రీ విద్యతోనే సమాజాభివృద్ధి సాధ్యమని వక్తలు ఉద్ఘాటించారు. సెప్టెంబర్ 28న సర్దార్ భగత్ సింగ్ 116 వ జయంతి సందర్భంగా వారం రోజులు పాటు వివిధ విద్యాసంస్థల్లో సామాజిక అంశాల పై సెమినార్ లను నిర్వహిస్తున్నామని, అందులో భాగంగా గేట్ డిగ్రీ కళాశాల నందు విద్య ప్రాముఖ్యత- మహిళా సమస్యలు - అంశం పై గేట్ డిగ్రీ కళాశాల లో సెమినార్ నిర్వహించినట్లు ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు తెలిపారు. ఎస్ ఎఫ్ ఐ జిల్లా అధ్యక్షులు రవి అధ్యక్షతన జరిగిన ఈ సెమినార్ లో శ్రీ పద్మవతి జూనియర్ కళాశాల అధ్యాపకురాలు భారతి, ఐద్వా జిల్లా కార్యదర్శి సాయి లక్ష్మి, ఎస్ ఎఫ్ ఐ కార్యదర్శి మాధవ్ లు ముఖ్య అతిధులు గా హాజరై ప్రసంగించారు. ఒక కుటుంబంలో మహిళ విద్యాభ్యాసం చేస్తే ఆ మహిళతో పాటు ఆ కుటుంబం మొత్తానికి లబ్ది చేకూరుతుందని తెలిపారు. సమాజంలో కేవలం మాటలలో మాత్రమే స్త్రీలను గొప్ప గా కీర్తిస్తున్నారని, కానీ వాస్తవంగా సమాజం లో ప్రతి క్షణం మహిళలపై దాడులు, అత్యాచారాలు, వివక్షత రోజు రోజుకు భయంకరంగా పెరుగుతున్నాయన్నారు. వీటన్నింటిని ధైర్య, సాహసాలకు చిరునామాగా భావించే భగత్ సింగ్ స్ఫూర్తితో ప్రశ్నించే తత్వాన్ని అలవరుచుకొని, సమాజంలోని రుగ్మతలు పైన, సమాన హక్కులకై అమ్మాయిలే ముందడుగు వేయాలని వారు పిలుపునిచ్చారు. సమాజం లో కుటుంబం నుంచే ఎలాంటి వివక్షత లేకుండా అబ్బాయిలతో సమానంగా పెంచితే మహిళలపై గౌరవం పెరుగుతుందని, సమానంగా చూసే సోదరభావం పెంపొందించేలా చైతన్యవంతం గా ఆలోచనలు పెంచుకోవాలని కోరారు.. కేంద్రం తీసుకొస్తున్న నూతన విద్యా విధానం ద్వారా అమ్మాయిల చదువులను మరింత దూరం చేసే కుట్ర జరుగుతుందని, ఎన్ ఈ పి కు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. భగత్ సింగ్ ను స్మరించుకొని వివక్ష లేని సమాజం కోసం, ఆకలి, పేదరికం లేని స్వాతంత్రం కోసం అందరికీ విద్యా, ఉపాధి, వైద్యం కోసం ఎస్ ఎఫ్ ఐ సాగించే పోరాటాలలో పాలుపంచుకోవాలని వారు అన్నారు. ఈ కార్యక్రమం లో ఐద్వా జిల్లా అధ్యక్షురాలు జయంతి, ఎస్ ఎఫ్ ఐ ఉపాధ్యక్షులు అక్బర్, అశోక్, జెవివి నాయకులు హేమంత్ పాల్గొన్నారు.

మెగా మల్టీ స్కిల్ వర్క్ షాప్ ప్రారంభం

ప్రజాశక్తి -తిరుపతి సిటీ: తిరుపతి కలెక్టరేట్ లో సెట్విన్,, డిపార్ట్మెంట్ ఆఫ్ యూత్ సర్వీసెస్ ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన మెగా మల్టీ స్కిల్ వర్క్ షాప్ ను రాష్ట్ర యువజన, క్రీడా శాఖ మంత్రి ఆర్కె రోజా, తిరుపతి జిల్లా కలెక్టర్ కె.వెంకటరమణారెడ్డి, ప్రవీణ్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ పారామెడికల్ సైన్స్ చైర్మన్ డాక్టర్ వై ప్రవీణ్ శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి ఆర్కె రోజా మాట్లాడుతూ సెట్విన్ ద్వారా ఉచితంగా నిర్వహించే స్కిల్ డెవలప్మెంట్ ట్రైనింగ్ ప్రోగ్రామ్స్ నందు శిక్షణ పొంది ఉపాధి అవకాశాల్ని మెరుగుపరుచుకోవాలని అన్నారు మహిళలు అన్ని రంగాలలో ముందుకి వస్తున్నారని ఈ శిబిరంలో కూడా మహిళలు ఎక్కువగా ఉండడాన్ని గమనించి వారిని అభినందించారు. కలెక్టర్ మాట్లాడుతూ యువతుల్లోని సజనాత్మక శక్తిని బయటకి తీసేందుకు ఈ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారని, దీనిని ఉపయోగించుకుని యువత వారి వత్తి నైపుణ్యాలు పెంచుకోవాలని అన్నారు. రాబోయే రోజుల్లో మరిన్ని శిక్షణ, నైపుణ్య అభివద్ధి కార్యక్రమాలు చేపడతామని అన్నారు. దీనిని నిర్వహిస్తున్న సెట్విన్ డాక్టర్ మురళీకృ ష్ణను అభినందించారు. ప్రవీణ్ మాట్లా డుతూ సెట్విన్ వత్తి నైపుణ్య కార్యక్ర మాలు నిర్వహించడం అభినంద నీయమని, వాటిలో తనని భాగస్వామ్యం చేయడం ఒక భాగ్యమని, ఇటువంటి కార్యక్రమానికి తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సెట్విన్ మేనేజర్ మోహన్ కుమార్, హెచ్డి మీడియా వర్క్స్ హేమంత్, త్రివర్ణ ఆర్ట్స్ ఆర్కే చరణ్ వీరికి శిక్షణ ఇవ్వనున్నారు. ఈ కార్యక్రమంలో జెస్సీ గ్రేస్, పర్షియన్, పలు కళాశాలలకు చెందిన విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.



గాయపడ్డ వారిని ఆస్పత్రికి తరలిస్తున్న108 సిబ్బంది

వాహనాలు ఢీ

నలుగురికి గాయాలు

ప్రజాశక్తి - బైరెడ్డిపల్లి: కారు, బొలేరో వాహనం ఢీకొన్న ప్రమాదంలో నలుగురుతీవ్రంగా గాయపడ్డారు. వారిలో ముగ్గురు పరిస్థితి అత్యంత విషమంగా మారిన ఈ సంఘటన మండలంలో ఆదివారం చోటు చేసుకుంది. కుప్పం నుండి పలమనేరు కు వెళుతున్న కారు డ్రైవర్ కి, ఐదు సంవత్సరాల బాలుడు తీవ్ర గాయాలయ్యాయి. పలమనేరు నుండి శాంతిపురం సంతకు పశువులను బులోరా వాహనంలో తరలిస్తుండగా ఈ సంఘటన చోటు చేసుకుంది. డ్రైవర్ దామోదర్ (33) తలకు బలమైన గాయాలయ్యాయి. బొలెరో వాహనంలో వెళుతున్న ముగ్గురికి స్వల్ప గాయాలతో బయటపడ్డారని వీరిని 108 వాహన సిబ్బంది పైలెట్ గౌస్ బాషా, ఈఎంటి ఈశ్వరయ్య సహాయంతో పలమనేరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించినట్లు వారు సమాచారం అందించారు.



ప్రమాదంలో గాయపడ్డ బాలుడు



నిందితుల్ని చూపుతున్న డిఎస్‌పి శ్రీనివాసమూర్తి

గంజాయి అక్రమ రవాణా పట్టివేత

ముగ్గురి అరెస్టు

ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్: జిల్లా ఎస్‌పి రిశాంత్ రెడ్డి ఆదేశాల మేరకు చిత్తూర్ డిఎస్‌పి శ్రీనివాస మూర్తి పర్యవేక్షణలో సిఐ విశ్వనాథ రెడ్డి, ప్రసాద్, సబ్ ఇన్‌స్పెక్టర్ , సిబ్బంది ముందస్తు సమాచారం మేరకు కట్టమంచి పరిసర ప్రాంతాలలో దాడులు నిర్వహించి చిత్తూరుకు చెందిన మురుగన్, వెంకటేష్, ఉమాపతి అనే ముగ్గురు వ్యక్తుల నుంచి అక్రమంగా గంజాయి వ్యాపారం చేస్తుండ సుమారు రెండు లక్షలు విలువ చేయు గంజాయి తో పాటూ ఓ కారును స్వాధీనం చేసుకున్నారు. నిందితులను డిఎసపి శ్రీనివాస్ మీడియాకు చూపించారు. డిఎస్‌పి మాట్లాడుతూ ఇక పై దాడులు కొనసాగుతాయని, ఎంతటి వారైనా అరెస్టు చేసి, చట్టపరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.



కిషోర్ కుటుంబానికి ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

కిషోర్ కుటుంబానికి ఆర్థిక సాయం

ప్రజాశక్తి -రామకుప్పం:మండలంలోని విజలాపురం గ్రామానికి చెందిన కిషోర్ అనారోగ్యంతో మృతి చెందారు. ఆదివారం టిడిపి, వైసిపి నేతలు, పెద్ద ఎత్తున కార్యకర్తలు ఆయన భౌతికకాయానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అనంతరం టిడిపి, వైసిపి ఆదేశాలతో వారి కుటుంబానికి పది పది వేల రూపాయలు ఆర్థిక సాయం అందించారు. పార్టీలకు అతీతంగా ఆర్థిక సహాయం అందించడంతో టిడిపి, వైసిపి పార్టీలకు బాధిత కుటుంబీకులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు బాబురెడ్డి, ఎంపీటీసీ వెంకట్రామ గౌడు, నేతలు నరసింహులు ,జనార్ధన్ రెడ్డి, తులసి కుమార్, మెకానిక్ బాబు, టిడిపి మాజీ సర్పంచ్ శ్రీనివాసరెడ్డి ,పంచాయతీ అధ్యక్షుడు కుమార్, మాజీ ఎంపీటీసీ వేణుగోపాల్, నేతలు మురళి, వేణుగోపాల్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.